క్లుప్తంగా

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని మోదుగువలస (చిన్నకొల్లివలస పునరావాస కాలనీ)లో ఉన్న సంతోషి మాత ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదే గ్రామానికి చెందిన ఎల్.ఎన్.పేట ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, స్థానిక సర్పంచ్ రెడ్డి రామారావు దంపతులు విఘ్నేశ్వర పూజతో వేడుకలను ప్రారంభించారు. పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యే పూజా కార్యక్రమాలను నిర్వహించినట్లు గ్రామ పురోహితులు భాస్కరభట్ల వరప్రసాద్ శర్మ తెలిపారు. సోమవారం ఉమారామలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ పూజలు ఉంటాయని సర్పంచ్ రెడ్డి రామారావు చెప్పారు.

యువతలో భక్తిభావం పెంపొందాలి



ప్రవచనాలు చెబుతున్న ప్రకాశ్‌స్వామి

పోలాకి: యువతలో భక్తిభావం పెంపొందాలని తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మప్రచారకులు లంకవలస ప్రకాశ్‌స్వామి అన్నారు. ఆదివారం చింతాడపేట లోని రామయోగి సేవాశ్రమంలో నిర్వహించిన సత్సంగంలో ఆయన పాల్గొన్నారు. భక్తిభావం వల్ల చెడు వ్యసనాలకు దూరంగా ఉంటారని, పెద్దలంటే గౌరవం ఏర్పడుతుందన్నారు. పూర్వకాలంలో భక్తిమార్గం అనుసరించిన వాళ్లంతా జీవితంలో గొప్పస్థాయికి వెళ్తారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు బమ్మిడి విశ్వనాథం తోపాటు పలువురు ఆధ్యాత్మిక ప్రవచనకారులు పాల్గొన్నారు.

36 మద్యం బాటిళ్ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను ప్రదర్శిస్తున్న ఎస్‌ఐ కామేశ్వరావు

పాతపట్నం: మండలంలోని బూరగాం గ్రామం వద్ద పోలీసులు తనిఖీల్లో 36 ఒడిశా మద్యం బాటిళ్లను ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. బూరగాం గ్రామానికి చెందిన కొరాడ కృష్ణ వద్ద ఒడిశా మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ ఎన్.కామేశ్వరరావు తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ



దుర్గాప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి, తదితరులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని శ్యామలాపురం గ్రామానికి చెందిన ఇప్పిలి దుర్గాప్రసాద్ (విద్యార్థి) విశాఖపట్నంలోని వెంకోజీపాలెం వద్ద రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మృతిని తండ్రి జగదీష్‌ను పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆదివారం పరామర్శించారు. మృతుని చిత్రపటానికి నివాళులర్పించి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. కరకవలస గ్రామానికి చెందిన పంచిరెడ్డి అప్పలసూరి ప్రమాదవశాత్తు గాలికి గాయం కావటంతో ఆయనను ఎమ్మెల్యే పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కొల్ల కృష్ణ, బలగ గోవిందరావు స్థానిక నాయకులు ఉన్నారు.

నేడు వైద్య శిబిరం

హిరమండలం: మండలంలోని అంబావల్లి గ్రామంలో గల ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో సోమవారం ఉదయం 8 గంటలకు అమ్మన్న చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జెమ్స్ ఆస్పత్రి వైద్యులతో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ట్రస్టు అధ్యక్షుడు తంగి రమేష్ ఆదివారం తెలిపారు. ఈ శిబిరంలో క్యాన్సర్, కిడ్నీ, కీళ్ల సమస్యలున్న రోగులతోపాటు సాధారణ వ్యాధులున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి సేవలందించడం జరుగుతందన్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందిస్తామన్నారు. రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవం

పొందూరు: స్థానిక అయ్యప్పస్వామి సహిత పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ అష్టమ వార్షికోత్సవం ఆదివారంతో ముగిసింది. మండపారాధనలు, విశేష హోమాలు, మహాలింగార్చన, మహాకుంభాభిషేకం, పలు పూజా కార్యక్రమాలు ఆలయ ప్రధాన అర్చకులు గిరిశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఉగాదికి నాటికి సామూహిక
గృహ ప్రవేశాలు

● గృహ నిర్మాణశాఖ ఏఈ శంకరరావు



రావులవలసలో లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న హౌసింగ్ ఏఈ శంకరరావు

నరసన్నపేట: మండలంలో జగనన్న లే అవుట్లలో ఉగాది నాటికి 1,465 ఇళ్లల్లో గృహ ప్రవేశాలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు గృహ నిర్మాణ శాఖ ఏఈ శంకరరావు తెలిపారు. ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నామని, లక్ష్యం పూర్తి చేయడానికి లబ్ధిదారులను చైతన్యవంతం చేస్తున్నామన్నారు. రావులవలసలో ఆయన ఇళ్ల నిర్మాణ పనులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ ఫిబ్రవరి 11 నాటికి 902 ఇళ్లు పూర్తయ్యాయని, మరో 270 ఇళ్ల స్లాబ్‌లు పూర్తయి పనులు చివర దశలో ఉన్నాయని తెలిపారు. జమ్ము పంచాయతీ గడ్డెయ్యపేట వద్ద ఇళ్ల నిర్మాణం పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. ఉర్లాం, బడ్డవానిపేట, పోతయ్యవలస, మడపాం లేఅవుట్లలో కూడా పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. మొత్తం 43 లే అవుట్లను మండలంలో ఏర్పాటు చేయగా.. దీంట్లో 40 లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఉర్లాం, గడ్డెయ్యపేట లే అవుట్ల వద్ద ఆర్చీల నిర్మాణానికి కలెక్టర్ అనుమతించారని, వీటిని ఉగాది నాటికి ఏర్పాటు చేస్తామన్నారు. లబ్ధిదారులందరూ ఇళ్ల నిర్మాణ పనులు పూర్తిచేయాలన్నారు. బిల్లులు ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేస్తున్నామన్నారు. లే అవుట్లలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. విద్యుత్, అంతర్గత రోడ్డు, డ్రైనేజీలు, తాగునీటి వ్యవస్థలను ఏర్పాటు చేశామన్నారు.

సమస్యలు పరిష్కరించే వారికే మద్దతు



మాట్లాడుతున్న పట్టభద్రుల సంఘం అధ్యక్షుడు మాధవరెడ్డి

హిరమండలం: నిరుద్యోగ, పట్టభద్రుల సమస్యల పరిష్కారం కోసం శాసన మండలిలో పోరాడే వ్యక్తికే పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నుకోవాలని మండల పట్టభద్రుల సంఘం అధ్యక్షుడు టి.మాధవరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పట్టభద్రుల ఓటర్ల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతవరకు పట్టభద్రుల ఓట్లతో ఎమ్మెల్సీగా గెలిచిన నాయకులు నిరుద్యోగులకు అన్యాయం చేశారన్నారు. ఎన్నికయిన తర్వాత స్వప్రయోజనం కోసం మాత్రమే పనిచేసి, ఓట్లు వేసిన పట్టభద్రులను విస్మరించారన్నారు. మార్చి 13న ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అభ్యర్థులు నేరుగా సంఘ సభ్యుల వద్దకు వచ్చి సమస్యలు పరిష్కరించే దిశగా హామీ ఇస్తారో వారికే తమ మద్దతు తెలియజేస్తామన్నారు. ఇప్పటివరకు మండలంలో 748 ఓట్లు నమోదు చేయించామని, ఇంకా అర్హులైనవారు ఓటరుగా నమోదు చేయని వారు ఉంటే ఈ నెల 15లోగా నమోదు చేసుకోవాలన్నారు. సంఘ సభ్యులు వి.రాజేష్, అప్పలరెడ్డి, టి.శివ, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కిట్లు పంపిణీ చేస్తున్న మండల ప్రత్యేకాహ్వానితుడు సత్యనారాయణ

సరుబుజ్జిలి: అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం పనిచేస్తుందని మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ తెలిపారు. మండలంలోని పురుషోత్తపురం గ్రామంలో గ్రామ వలంటీర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులకు ఆదివారం కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిట్లులో ఏర్పాటు చేసిన మెటీరియల్ ద్వారా గతానికి, ప్రస్తుతానికి ప్రభుత్వ పథకాల్లో ఉన్న తేడాలతో ముద్రించిన కరపత్రాలను ప్రతీ ఇంటికి అందించాలన్నారు. తలుపుపై స్టిక్కర్ అతికించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ పైడి నర్సింహప్పారావు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానంపై అవగాహన



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు

పాతపట్నం: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన విద్యావిధానం బాగుందని పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షుడు భీమసేన్ పండా అన్నారు. స్థానిక అమ్మవారి ఆలయం సమీపంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండలంలో పీఆర్‌టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉపాధ్యాయులకు నూతన విద్యా విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం రెండు డీఏలను విడుదల చేయాలన్నారు. పీఆర్సీ బకాయిలను చెల్లించాలన్నారు. అవార్డులు పొందిన, బదిలీపై వెళ్లిన పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. గౌరవ అధ్యక్షుడు రెగెటి మధుసూదనరావు, మండల ప్రధాన కార్యదర్శి లూకలాపు గోవిందరావు, అమర జనార్దనరావు, వట్టి భాస్కరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆ మలుపు.. ప్రమాదానికి పిలుపు



పొన్నాంపేట సమీపంలో..



ఆమదాలవలస వయెడెక్ట్ సమీపంలో..

సరుబుజ్జిలి: ఆమదాలవలస నుంచి పురుషోత్తపురం వరకు ఉన్న ఆర్అండ్‌బీ రహదారిలో మూడు మలుపులు ఉన్నాయి. మలుపులు వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడం వల్ల తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఒకేసారి మలుపు ఉండడం వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు పూర్తిగా కనిపించడంలేదు. రహదారికి ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ కూడా చేయకపోవడంతో ఇబ్బందికరంగా ఉంటుంది. రాత్రి వేళల్లో కొత్తగా ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రాజమ్మతల్లి జాతరకు పోటెత్తిన భక్తులు



క్యూలో వేచి ఉన్న భక్తులు

పొందూరు: మండలంలోని దళ్లవలస గ్రామంలో వెలిసిన రాజమ్మతల్లి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం జరిగిన జాతరకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ప్రతీ రెండేళ్లకు ఒకసారి ఈ జాతరను ఆలయ కమిటీ సభ్యులు నిర్వహిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాతోపాటు విజయనగరం, విశాఖ, తూర్పుగోదావరి తదితర ప్రాంతాల భక్తులు తరలివచ్చారు. పొందూరు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయడంతో జాతర సజావుగా జరిగింది.

ఎన్నికల కోడ్ అమలు చేయాలి

నరసన్నపేట: మండలంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలకు సంబంధించి కోడ్ అమలులో ఉందని, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు గ్రామాల్లో కోడ్‌ను పటిష్టంగా అమలు చేయాలని ఎంపీడీఓ బి.మధుసూదనరావు తెలిపారు. గ్రామాల్లో రాజకీయ నాయకుల ఫొటోలు, ఫ్లెక్సీలు తొలగించాలని, నేతల విగ్రహాలకు ముసుగులు వేయాలని సూచించారు. ఆ మేరకు సోమవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశామని, దీంట్లో ఎన్నికల కోడ్‌కు సంబంధించి పంచాయతీ కార్యదర్శులకు, వీఆర్వోలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

భర్తీకానున్న అంగన్‌వాడీ పోస్టులు

సారవకోట: సారవకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని సారవకోట మండలంలో ఎన్నో ఏళ్ల నుంచి ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా, మినీ కార్యకర్తల పోస్టులు భర్తీ కానున్నాయి. మండలంలోని గొర్రిబంద, గోవర్ధనపురం, కుమ్మరిగుంట, తొగిరి అంగన్‌వాడీ ఆయా పోస్టులు గత 7 ఏళ్ల నుంచి సరైన రోస్టర్ విధానం రాక పోవడంతో ఖాళీలు భర్తీ కాలేదు. గోపినాథపురం, బుడ్డయ్యపేట మినీ అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు సైతం ఇదే తీరు. ఈ సారి నోటిఫికేషన్‌లో ప్రభుత్వం ఈ కేంద్రాలన్నింటికీ జనరల్ రిజర్వేషన్ కేటాయించడంతో ఈ పోస్టులన్నీ భర్తీ అయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే ఉన్నటువంటి ఖాళీలు ఎప్పటికప్పుడు భర్తీ చేస్తున్నా.. ఈసారి వచ్చే నోటికేషన్‌తో ఏన్నో ఏళ్ల నుంచి ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ కానున్నాయి.

వేమన రచనల్లో సామాజిక స్పృహ



వక్తను సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: వేమన రచనలు సామాజిక దృక్పథం కలిగి ఉంటాయని తెలుగు పండితులు పూడి మోహనరావు అన్నారు. బాపూజీ కళామందిర్‌లో వేమన–సామాజిక దృక్పథం అనే అంశంపై ఆదివారం ప్రసంగించారు. వేమన తన అనుభవాల నుంచి వచ్చిన జ్ఞానాన్ని పద్యాల ద్వారా మనకు అందించారని చెప్పారు. సమాజంలోని రీతులను, నీతులను తెలియచేయడానికి సామాన్యుడికి అర్థమయ్యే భాషలో నిత్య సమస్యలను ధిక్కరణ స్వరంతో ఆటవెలది పద్య చంధస్సులో సమాజ వికాసానికి కృషి చేసిన అచ్చ తెలుగు కవి వేమన అని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ సనపల నారాయణమూర్తి, ఎం.శ్రీనివాసరావు, నిష్టల నర్సింహమూర్తి, కోమలరావు, పతంజలి శాస్త్రి, శివరాం, తవుడు, డి.జి.పట్నాయక్, పి.ప్రసాద్, సరస్వతి, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

అభినయం అదరహో..!



కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న దృశ్యం

అరసవలి: అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి దేవాలయంలో ఆదివారం సాయంత్రం ధర్మపథం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కూచిపూడి నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. అనంతపురం జిల్లాకు చెందిన వందనా డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు ఈ నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాశరావు, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ తదితరులు పాల్గొన్నారు.

దైవ చింతనతోనే ప్రశాంత జీవితం



కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

● పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: ప్రతి ఒక్కరూ దైవచింతన కార్యక్రమాల్లో పాల్గొని ప్రశాంత జీవితాన్ని పొందాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని బోరుభద్ర గ్రామంలో గల అభయాంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆదివారం ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. అభయాంజేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవుడిని పూజించటం వల్ల ఆరోగ్యం, విజ్ఞానం, విచక్షణ కలుగుతుందన్నారు. మానవుడు పరిపూర్ణ వ్యక్తిగా ఎదగాలంటే ఆధ్యాత్మిక మార్గం అవశ్యమని వివరించారు. అందువల్ల అందరూ ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకోవాలన్నారు. సర్పంచ్ సవిరిగాన శ్రీదేవి, ఎల్.ఎన్.పేట ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, వైస్ఎంపీపీ సవిరిగాన ప్రదీప్, వైఎస్సార్‌సీపీ నాయకులు సవిరిగాన శ్రీనివాసరావు, రెడ్డి రామారావు, మురళి ఆప్తో, జి.రాము, గ్రామస్తులతో పాటు పరిసర ప్రాంతానికి చెందిన భక్తులు పాల్గొన్నారు.

శివరాత్రికి డే అండ్ నైట్ క్రికెట్ టోర్నీ



మాట్లాడుతున్న ఆర్ఎస్‌పి క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు

నరసన్నపేట: స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో శివరాత్రికి ఈ నెల 17, 18 తేదీల్లో డే అండ్ నైట్ క్రికెట్ జిల్లా టోర్నమెంట్ (డీపీఎల్ సీజన్ ఫోర్) నిర్వహిస్తున్నామని ఆర్ఎస్‌పి క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు పెదిరెడ్ల రాము, డేవిడ్, అనిల్ ఆదివారం తెలిపారు. 17 ఉదయం నుంచి రాత్రి 12 వరకు, 18న ఉదయం నుంచి పోటీలు ముగిసే వరకూ టోర్నమెంట్ నిర్వహిస్తామన్నారు. 8 ఓవర్ల చొప్పున మ్యాచ్ ఉంటుందని, మొదటి 30 జట్లును మాత్రమే పోటీలకు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతీ క్రీడాకారుడు యూనిఫాం వేసుకోవాలని, అడ్రాస్ కోసం ఆధార్ కార్డు చూపించాల్సి ఉంటుందన్నారు. విన్నర్స్, రన్నర్స్‌కు నగదు బహుమతి ఉంటుందని తెలిపారు. బెస్ట్ ఆల్ రౌండర్, బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాట్స్‌మేన్‌లకు ప్రత్యేక నగదు బహుమతి అందిస్తామన్నారు. ఆసక్తి గల జట్లు ఫోన్ 80083 74884, 95732 07752, 77028 53628 నంబర్లను సంప్రదించాలన్నారు.

మాజీ ఎంపీటీసీ విగ్రహావిష్కరణ



మనోహర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ

సారవకోట: మండలంలోని మొదిలికొత్తూరు గ్రామంలో మాజీ ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు కరణం మనోహర్ విగ్రహాన్ని ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు ఆదివారం ఆవిష్కరించారు. గత ఏడాది అనారోగ్యం కారణంగా మనోహర్ మృతి చెందారు.

ఆయన జ్ఞాపకార్థం గ్రామస్తులు, కుటుంబ సభ్యులు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి చిన్నాల వెంకట సత్యనారాయణ, సర్పంచ్‌లు జన్ని అనురుద్రుడు, సాధు సతీష్, గొంటి లక్ష్మణరావు, పార్టీ నాయకులు బొడ్డెపల్లి సుధాకరరావు, ఉరిటి రంజిత్, నక్క రామరాజు, శోభనాపురం మురళి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సర్వీసులు పెంచాలి



ప్రయాణికులతో కిటకిటలాడుతున్న బస్సు

సరుబుజ్జిలి: ఆర్టీసీ బస్సులు వేళకు రాకపోవడం వల్ల పలువురు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధానంగా చదువుల కోసం వెళ్తున్న విద్యార్థులు, ఉద్యోగులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఆర్డినరీ బస్సుల సంఖ్య గతంలో కంటే భారీగా తగ్గించడం వల్ల గంటల కొద్ది బస్సుల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితులు ఉన్నాయని ప్రయాణికులు తెలిపారు. వేచి ఉండలేక కొంతమంది ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో బస్సులు సంఖ్య పెంచాలని ఆర్టీసీ అధికారులను పలువురు కోరుతున్నారు.

దట్టంగా పొగ మంచు



సిద్ధాంతం రోడ్డులో దట్టంగా కురుస్తున్న పొగమంచు

ఎల్.ఎన్.పేట: మండలంలో ఆదివారం ఉదయం 9 గంటల వరకు పొగ మంచు దట్టంగా కమ్మేసింది. పగటి ఉష్ణోగ్రత కంటే రాత్రి ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుంది. సాయంత్రం నుంచి మంచు కురవటం ప్రారంభం అవుతుంది. మంచు అధికంగా కురవటంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. పొగ మంచు కారణంగా జీడి, మామిడి పూతకు నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు



కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

నరసన్నపేట: మండలంలోని బసివలసలో గల బొమ్మాళమ్మ పేరంటాల వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం రాత్రి మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బసివలసలో ఆధ్యాత్మికత నెలకొంది. బొమ్మాళమ్మ పేరంటాలకు భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.